
www.prajasakti.com
ప్రజాశక్తి
మంగళవారం 9 జనవరి 2024
5
తిరుపతి



'పూర్ణకుంభం సర్కిల్ సిద్ధం చేయండి'

ప్రజాశక్తి- తిరుపతి టౌన్: పూర్ణకుంభం సర్కిల్ పనులు పూర్తిచేసి ప్రారంభానికి సిద్ధం చేయాలని నగరపాలక సంస్థ కమిషనర్ హరిత అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. తిరుపతి ఆర్టీసి బస్టాండ్ వద్ద శ్రీనివాససేతు క్రింద ఏర్పాటు చేస్తున్న సుందరీకరణ పనుల్లో భాగంగా జరుగుతున్న పనులను సోమవారం పరిశీలించారు. ఆమె మాట్లాడుతూ గతంలో పూర్ణకుంభం ప్రతిమ, ఎమ్మెస్ సుబ్బులక్ష్మి విగ్రహం, తెలుగుతల్లి విగ్రహం ఉండేదని, శ్రీనివాససేతు నిర్మాణంలో భాగంగా విగ్రహాలను భద్రపర్చడం జరిగిందని వివరించారు. శ్రీనివాససేతు నిర్మాణం పూర్తి కావడంతో ఇదే సర్కిల్లో పూర్ణకుంభం ప్రతిమను, ఎమ్మెస్ సుబ్బులక్ష్మి, తెలుగుతల్లి విగ్రహాలను, సహాయ మిత్ర కార్మికుల విగ్రహాలను ప్రతిష్టించడం జరుగుతుందన్నారు. విగ్రహాల కూడళ్లలో సుందరీకరణ పనులకు ప్రాధాన్యత ఇవ్వాలని, పచ్చదనం పెంపుపై శ్రద్ధ తీసుకోవాలని మునిసిపల్ఇంజనీర్ను ఆదేశించారు.

ఎస్మాకు భయపడేది లేదు..


తిరుపతి పాత మున్సిపల్ ఆఫీసు ఎదుట జోరు వానలోనూ అంగన్వాడీల నిరసన


నాయుడుపేటలో..


కోటలో..


నారాయణవనంలో..


పుత్తూరులో..


బిఎన్ కండ్రిగలో..


గూడూరులో..

వర్షంలోనూ అంగన్వాడీల నిరసనలు

ప్రజాశక్తి - తిరుపతి టౌన్

తిరుపతి నగరంలోని పాత మున్సిపల్ కార్యాలయం రోడ్డులో జోరున వర్షం కురుస్తున్నా అంగన్వాడీలు దీక్షలను కొనసాగించారు. ఈసందర్భంగా ఎస్మా చట్టాన్ని కాదు.. వర్షాన్ని కూడా ఎదిరిస్తామని నినాదాలు చేస్తూ మానవహారం నిర్వహించారు. సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి కందారపు మురళి, సిపిఐ జాతీయ కార్యదర్శి నారాయణ మాట్లాడుతూ అంగన్వాడీల మీద ఎస్మాను ప్రవేశపెట్టడం అంటే ఈ ప్రభుత్వం అన్నిరకాలుగా విఫలం అయ్యిందని, హామీలు అమలు చేయకుండా దుర్మార్గమైన చట్టాలు తీసుకువస్తే భయపడేది లేదని అన్నారు. యూనియన్ జిల్లా గౌరవాధ్యక్షులు కేఎస్ఎన్ ప్రసాదరావు, సిఐటియు నగర ప్రధాన కార్యదర్శి వేణుగోపాల్, ఎఐటియుసి జిల్లా కార్యదర్శి రాధాకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

గూడూరు టౌన్: అంగన్వాడీ కార్యకర్తల నిరవధిక సమ్మె 28వ రోజూ కొనసాగింది. అంగన్వాడీలపై ఎస్మా ప్రయోగించిన వెనకడుగు వేసే ప్రసక్తే లేదన్నారు. డివిజన్ రైతు సంఘం నాయకులు జోగి శివకుమార్, సిఐటియు నాయకులు ఇంద్రావతి, బివి. రమణయ్య, ఎస్.సురేష్, ఎ.ప్రసాద్, అంగన్వాడీలు పాల్గొన్నారు.

నాయుడుపేట: స్థానిక ఐసిడిఎస్ కార్యాలయం ఆవరణలోని సమ్మె శిబిరం వద్ద అంగన్వాడీలు 28వ రోజూ నిరసన తెలిపారు. సిఐటియు జిల్లా కార్యదర్శి నాయకులు శివకవి, ముకుంద, అంగన్వాడీ ప్రాజెక్టు కార్యదర్శి ఎస్.శ్యామలమ్మ తదితరులు పాల్గొన్నారు.

బుచ్చినాయుడు కండ్రిగ: స్థానిక ఎంపీడీవో కార్యాలయం ఎదుట అంగన్వాడీలు చేపట్టిన సమ్మె సోమవారం 28వ రోజూ నిరవధికంగా కొనసాగుతోంది. తమ సమస్యలను పరిష్కరించాలంటూ అంగన్వాడీలు వర్షంలోనూ నిరసన తెలిపారు. ప్రాజెక్టు కార్యదర్శి సుదర్శనం, అంగన్వాడీలు పాల్గొన్నారు.

పుత్తూరు టౌన్: తహశీల్దార్ కార్యాలయం ఎదుట సిఐటియు ఆధ్వర్యంలో 28వ రోజూ అంగన్వాడీలు సమ్మెను కొనసాగించారు. వర్షంలోనే గొడుగులతో తహశీల్దార్ కార్యాలయం నుంచి స్థానిక అంబేద్కర్ సర్కిల్ వరకు ర్యాలీ నిర్వహించారు. సిఐటియు జిల్లా కార్యదర్శి ఆర్.వెంకటేష్, అంగన్వాడీలు మునికుమారి, విజయకుమారి, ధనమ్మ, రాధా, పద్మజ, మోహన్లక్ష్మి, లలిత, హైమావతి పాల్గొన్నారు.

నారాయణవనం: అంగన్వాడీ వర్కర్స్ నారాయణవనం తహశీల్దార్ కార్యాలయం నుంచి సిఐటియు ఆధ్వర్యంలో 28వ రోజూ వర్షంలోనే గొడుగులతో బైపాస్ అంబేద్కర్ సర్కిల్ వరకు ర్యాలీ నిర్వహించారు. అంగన్వాడీలు పద్మావతి, వాణి, నరసమ్మ, సుబ్బలక్ష్మి, జ్యోతి పాల్గొన్నారు.

కోట: రాష్ట్ర ప్రభుత్వం అంగన్వాడీలపై జారీ చేసిన ఎస్మా జీవోను తక్షణమే రద్దు చేసి తమ డిమాండ్లకు పరిష్కారం చూపాలని సోమవారం స్థానిక అంగన్వాడీ ప్రాజెక్టు కార్యాలయం ఎదుట ఎస్మా జీవో కాపీలను దగ్ధం చేశారు.

కలెక్టరేట్ ఎదుట మున్సిపల్ కార్మికుల ధర్నా


తిరుపతి కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న మున్సిపల్ కార్మికులు

ప్రజాశక్తి- తిరుపతి టౌన్: మున్సిపల్ కార్మికుల సమస్యలను తక్షణం పరిష్కరించాలని కోరుతూ తిరుపతి జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద సోమవారం తిరుపతి జిల్లాలోని వెంకటగిరి, గూడూరు, నాయుడుపేట, సూళ్లూరుపేట మున్సిపల్ కార్మికులు భారీ ముట్టడి కార్యక్రమం నిర్వహించారు. ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ (సిఐటియు) గౌరవాధ్యక్షులు జి.బాల సుబ్రమణ్యం మాట్లాడుతూ మునిసిపల్ కార్మికులు గత 14 రోజులుగా సమ్మె చేస్తున్నా ప్రభుత్వానికి చీమకుట్టినట్లు కూడా లేదని విమర్శించారు. మూడుసార్లు చర్చలు జరిపినప్పటికీ, సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం పూనుకోలేదని తెలిపారు. సమస్యలను ప్రభుత్వం పరిష్కరించకపోతే మరో మూడు సంవత్సరాల వరకు ఒక్క రూపాయి కూడా జీతం పెంచడం జరగదని నిర్లక్ష్యంగా చెప్పడం దారుణమని, ఇది పొమ్మనలేక పొగ పెట్టటమేనని అన్నారు. ప్రభుత్వ తీరు మునిసిపల్ కార్మికులను అవమానపరిచే విధంగా ఉందని ఆగ్రహం వ్యక్తం చేశారు. సమస్యను పరిష్కరించే పోగా రెచ్చగొట్టే ధోరణిని అనుసరించడం తగదన్నారు. న్యాయమైన సమస్యలను పరిష్కారం చేయకపోగా, రౌడీలను, గూండాలను కార్మికులపై దాడులకు ఉసి గొల్పుతున్నారని, వైఎస్ఆర్సిపి నాయకులు బెదిరింపులకు పాల్పడడం దుర్మార్గమన్నారు. ప్రత్యక్షంగా మునిసిపల్ ఛైర్మన్లు, కౌన్సిలర్లు పోలీసులను అడ్డం పెట్టుకొని దాడులు చేయడం అమానుషమని అన్నారు. పారిశుధ్య కార్మికులకు కనీస వేతనం రూ. 26వేలు ఇవ్వాలని, ఇంజనీరింగ్ కార్మికులకు రిస్క్ అలవెన్స్, 11వ పిఆర్సి ప్రకారం జీతాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. సమ్మెకు మద్దతు తెలుపుతున్న సిఐటియు నాయకులపై బైండ్ ఓవర్ కేసులుపెట్టడం సరికాదన్నారు. జిల్లా శ్రామిక మహిళా కన్వీనర్ ఆర్.లక్ష్మి, సిఐటియు జిల్లాకార్యదర్శి టి.సుబ్రహ్మణ్యం, యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి బి.గోపి, పద్మనాభం, వడ్డిపల్లి చెంగయ్య, చాపల వెంకటేశ్వర్లు, సుబ్బన్న, లక్ష్మి, ప్రభావతి, ప్రసాద్ పాల్గొన్నారు.

గూడూరు టౌన్: గూడూరులో మున్సిపల్ కార్మికుల నిరవధిక సమ్మె సోమవారానికి 14 రోజులకు చేరుకుంది. సిఐటియు పట్టణ అధ్యక్షులు బివి.రమణయ్య మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామీలను నెరవేర్చే అంతవరకు సమ్మెను విరమించబోమని, రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. రైతు సంఘం నాయకులు జోగి శివకుమార్, పట్టణ అధ్యక్ష కార్యదర్శులు బి.రమేష్, దారా కోటేశ్వరరావు, బి.మురళి, బి.పెంచల ప్రసాద్, శ్రామిక మహిళా కార్యదర్శి సంపూర్ణమ్మ పాల్గొన్నారు.

జోరు వానలోనూ ఎస్ఎస్ఎ ఉద్యోగుల సమ్మె

ప్రజాశక్తి - తిరుపతి టౌన్: సర్వశిక్ష అభియాన్ ఉద్యోగుల సమ్మె సోమవారానికి 20వ రోజుకు చేరుకుంది. జోరువానలోనూ తిరుపతి పాత మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయం వద్ద నిరసన తెలియజేశారని సంఘం గౌరవాధ్యక్షులు గండికోట నాగ వెంకటేష్ తెలిపారు. ప్రభుత్వం స్పందించి వారి న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని డిమాండ్చేశారు. నిరసనలో అధ్యక్షులు సూర్యకుమారి, హసీనా, ధనపాల్, వేణు, శివకుమార్, కాంత్, కంచి మాధవయ్య, ప్రదీప్ కుమార్, మునికృష్ణయ్య, ఎన్బి.రమేష్ పాల్గొన్నారు.


తిరుపతి పాత మున్సిపల్ ఆఫీసు ఎదుట జోరు వానలోనూ ఎస్ఎస్ఎ ఉద్యోగుల మానవహారం

టీటీడీ ఆలయాల ఆధునీకరణ వెబ్సైట్ ప్రారంభం


ఆధునీకరించిన వెబ్సైట్ను ప్రారంభిస్తున్న టీటీడీ ఛైర్మన్ భూమన

ప్రజాశక్తి - తిరుపతి సిటి: తిరుపతి, ఇతర ప్రాంతాల్లో గల టీటీడీ స్థానికాలయాలు, అనుబంధ ఆలయాలకు విస్తృత ప్రాచుర్యం కల్పించే దిశగా అన్ని వివరాలతో ఆధునీకరించిన వెబ్సైట్ను టీటీడీ ఛైర్మన్ భూమన కరుణాకరరెడ్డి ప్రారంభించారు. తిరుపతిలోని మహతి ఆడిటోరియంలో సోమవారం ఈ కార్యక్రమం జరిగింది. టీటీడీలో 60కి పైగా ఉన్న స్థానికాలయాలు, అనుబంధ ఆలయాలకు సంబంధించిన స్థలపురాణం, ఆర్జితసేవలు, దర్శన వేళలు, రవాణా వివరాలు, ఇతర సౌకర్యాలను పొందుపరిచారు. ఆలయ విశిష్టతపై ఫొటోలు, వీడియోలను అందుబాటులో ఉంచారు. జియో సంస్థ సహకారంతో టీటీడీ ఐటీ విభాగం ఈ వెబ్సైట్ ను ఆధునీకరించింది. ఈ కార్యక్రమంలో టీటీడీ ఈవో ఎవి.ధర్మారెడ్డి, జేఈవోలు సదా భార్గవి, వీరబ్రహ్మం, సివిఎస్ఓ నరసింహ కిషోర్, డిఎల్వో వీర్రాజు, సిఈ నాగేశ్వరరావు, ఐటి జనరల్ మేనేజర్ ఎల్ఎం.సందీప్ పాల్గొన్నారు.

నడకమార్గాల్లో విస్తృతంగా భక్తుల రక్షణ చర్యలు

భక్తులు నిర్భయంగా నడచిరావచ్చు : టీటీడీ ఈవో

ప్రజాశక్తి- తిరుపతి బ్యూరో

తిరుమల నడకమార్గాల్లో అడవి జంతువుల నుంచి భక్తుల రక్షణ కోసం విస్తృత ఏర్పాట్లు చేపడుతున్నామని, భక్తులు నిర్భయంగా నడకమార్గాల్లో శ్రీవారి దర్శనానికి రావొచ్చని టీటీడీ ఈవో ఎవి.ధర్మారెడ్డి అన్నారు. తిరుపతిలోని టీటీడీ పరిపాలన భవనంలో సోమవారం టీటీడీ, ప్రభుత్వ అటవీ శాఖ అధికారులతో ఈవో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా టీటీడీ డిఎఫ్వో, తిరుపతి సర్కిల్ సీసీఎఫ్, తిరుపతి డిఎఫ్వోలు కలిసి ప్రజంటేషన్ ద్వారా ఈవోకు వివరించారు. ఈసందర్భంగా ఈవో మాట్లాడుతూ తిరుమల నడకదారిలో అడవి జంతువుల నుండి భక్తుల రక్షణ కోసం ప్రిన్సిపల్ చీఫ్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్ (వైల్డ్లైఫ్), ఎపి చీఫ్ వైల్డ్లైఫ్ వార్డెన్ అధ్యక్షతన రాష్ట్ర ప్రభుత్వం జాయింట్ కమిటీని ఏర్పాటు చేసిందన్నారు. ఆ కమిటీ క్షేత్రస్థాయిలో పరిశీలన జరిపి రెండుసార్లు సమావేశమై ప్రభుత్వానికి నివేదిక సమర్పించిందన్నారు. నడక మార్గంలో భక్తుల రక్షణ కోసం తీసుకోవాల్సిన స్వల్పకాలిక, దీర్ఘకాలిక చర్యలను నివేదికలో పొందుపరిచారని తెలియజేశారు. స్వల్పకాలిక చర్యలను కొనసాగించాలని సూచించినట్టు చెప్పారు. అదేవిధంగా, టీటీడీ, ప్రభుత్వ అటవీ శాఖ ఇప్పటివరకు తీసుకున్న స్వల్పకాలిక చర్యలపై ఈవో కూలంకషంగా చర్చించారు. దీర్ఘకాలిక చర్యలైన అడవి జంతువుల పర్యవేక్షణ, అందుకు కావలసిన భవన సదుపాయం, సిబ్బంది, వ్యాలైన్ల ఏర్పాటు, బయోఫెన్సింగ్ (పొదల కంచె), ఏరియల్ వాక్ వే, అండర్పాస్, ఓవర్ పాస్ల కోసం స్థల ఎంపిక ఇతర మౌలిక వసతులపై చర్చించారు. వైల్డ్ లైఫ్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇండియా, డెహ్రాడూన్ వారికి లేఖ రాయాలని డిఎఫ్ఓను ఆదేశించారు. ఇందులో ఏరియల్ వాక్వే, అండర్పాస్, ఓవర్పాస్ ఏర్పాటుకు ఆకృతులు అందించాలని, టీటీడీ అటవీ యాజమాన్య ప్రణాళికలకు తోడ్పాటునందించాలని విజ్ఞప్తి చేయాలని కోరారు. టీటీడీ అందించిన రూ.3.75కోట్లతో వన్యప్రాణుల పర్యవేక్షణకు కావాల్సిన కెమెరాట్రాప్లు, మానిటరింగ్ సెల్, వ్యాలైన్ల ఏర్పాటు, అవుట్ పోస్టల నిర్వహణకు సత్వరం చర్యలు చేపట్టాలని తిరుపతి డిఎఫ్ఓను కోరారు. ఏడో మైలు నుండి శ్రీ లక్ష్మీనరసింహస్వామివారి ఆలయం వరకు నడకదారికి ఇరువైపులా లైటింగ్ వసతి కల్పించాలని, మానిటరింగ్ సెల్ కోసం భవనాన్ని సమకూర్చాలని సీఈని కోరారు. తిరుమల నడకమార్గాల్లో ఏరోజుకారోజు వ్యర్థాలను తొలగించాలని, తద్వారా అడవి జంతువులు రాకుండా చేయాలని ఆరోగ్యశాఖాధికారిని ఆదేశించారు. సమావేశంలో జెఈవో వీరబ్రహ్మం, సీసీఎఫ్ నాగేశ్వరరావు, ఎఫ్ఏసిఏవో బాలాజీ, చీఫ్ ఇంజినీర్ నాగేశ్వరరావు, జూపార్కు క్యూరేటర్ సెల్వం, డిఎఫ్వో శ్రీనివాస్, తిరుపతి డిఎఫ్వో జి.సతీష్ పాల్గొన్నారు.

'జగనన్న కాలనీ'లే కేంద్రంగా..

చంద్రగిరిలో 'బోగస్' ఓట్లు


42వేలు దొంగ ఓట్లంటున్న టిడిపి

ప్రజాశక్తి - తిరుపతి బ్యూరో

అధికారం చేతిలో ఉందన్న కారణంగా చెవిరెడ్డి భాస్కర్రెడ్డి నియోజకవర్గం చంద్రగిరిలో భారీగా బోగస్ ఓట్లు చేర్పించినట్లుగా ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. జగనన్న కాలనీలు ఇంకా పూర్తికాకుండానే పట్టా ఇచ్చిన అందరినీ ఓటర్లుగా చేర్చేశారని టిడిపి ఆరోపిస్తోంది. ఈ లెక్కన చంద్రగిరి నియోజకవర్గంలోనే రామచంద్రాపురం, పాకాల, చంద్రగిరి, చిన్నగొట్టిగల్లు, యర్రావారిపాలెం మండలాల్లోని జగనన్న కాలనీల్లోని ఇళ్లన్నీ 'డబుల్ ఎంట్రీ'గా నమోదు చేసి ఓటు హక్కు కల్పించినట్లు తెలుస్తోంది. ఉదాహరణకు బుంగా సుశీల తిరుపతి అర్బన్ మండలం మజ్జిగకాల్వ సమీపంలోని సుబ్బయ్యకాలనీలో నివాసం ఉంటోంది. నవరత్నాల్లో భాగంగా చంద్రగిరి మండలం కొటాల సమీపంలో జగనన్న కాలనీలో ఒకటిన్నర సెంట్ల స్థలం ఇచ్చారు. ఆ కుటుంబంలో ఆరుగురు ఉండగా, ఒకరు మినహా మిగిలిన ఐదుగురి ఆధార్ కార్డుల ఆధారంగా ఓటర్లుగా చంద్రగిరి నియోజకవర్గంలో కలిపేసుకున్నారు. కొటాలలో 2,500 ఇళ్లు నిర్మిస్తుండగా దాదాపు 8వేలు పైగా ఓటర్లను చేర్పించినట్లు సమాచారం. వీళ్లందరి ఓట్లు తిరుపతిలోనూ ఉన్నాయన్నది టిడిపి వాదన. తిరుపతి రూరల్ మండలం సి.మల్లవరం చెందిన ఎస్.లక్ష్మికి శానంబట్ల సమీపంలోని జగనన్న కాలనీలో ఇళ్లు ఇచ్చారు. వీరి ఇంట్లో ఐదు ఓట్లు ఉన్నాయి. వీరిని శానంబట్లలో ఓటర్లుగా నమోదు చేశారు. శానంబట్లలో 4వేల ఇళ్లు ఉండగా, దాదాపు 15వేల ఓట్లు చేర్పించేశారు. రామచంద్రాపురం రామాపురం దగ్గర 2,500 ఇళ్లు ఉండగా వీరందరినీ ఓటర్లుగా చేర్పించారు. పాకాల, యర్రావారిపాలెం, చిన్నగొట్టిగల్లు మండలాల్లోనూ ఇదే తంతు జరిగింది. దాదాపు నియోజకవర్గం మొత్తం కలిపి 42వేల దొంగోట్లను జగనన్న కాలనీల ఆధారంగానే చేర్పించినట్లు తెలుస్తోంది. వీరందరూ ఇతర ప్రాంతాల్లో నివాసం ఉండేవారే. జగనన్న కాలనీల నిర్మాణం పూర్తికాకపోయినా పట్టాల ఆధారంగా దొంగోట్లను వాలంటీర్ల ద్వారా చేర్పించాని టిడిపి ఆరోపిస్తోంది. ఎన్నికల ఉన్నతాధికారి కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లినా సమస్య పరిష్కారం కాకపోవడం వల్లనే తాము నిరసన చేపడుతున్నట్లు టిడిపి నియోజకవర్గ అభ్యర్థి పులివర్తి నాని ఆరోపిస్తున్నారు. జిల్లాలోని జగనన్న కాలనీల కేంద్రంగా డబుల్ఎంట్రీలు వేస్తూ దొంగోట్లు చేర్పించారన్నది వారి ప్రధాన ఆరోపణ. ఇదే వాస్తవమైతే క్షేత్రస్థాయికి వెళ్లి ఎన్నికల అధికారులు చేసిన పరిశీలన ఏమాత్రం చేశారో మరి. టిడిపి ఆరోపణలు కరెక్టా, ఎన్నికల అధికారుల క్షేత్రస్థాయి పరిశీలన కరెక్టా అన్నది ఎన్నికల ఫైనల్ జాబితా ప్రకటిస్తే తేలనుంది.

ఫిర్యాదు చేసినా దొంగ ఓట్లు తొలగించరా..?

- ఆర్డీవో కార్యాలయం ఎదుట పులివర్తి నాని నిరసన దీక్ష
- పెట్రోల్ పోసుకొని ఆత్మహత్యాయత్నం



తిరుపతి టౌన్: చంద్రగిరి అసెంబ్లీ నియోజకవర్గంలో సిట్టింగ్ ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్రెడ్డి తన కుమారుని గెలిపించుకోవడానికి భారీగా దొంగ ఓట్లు నమోదు చేయించారని, వాటిని తొలగించమని పలుమార్లు ఫిర్యాదులు చేసిన పట్టించుకోవడం లేదని టీడీపీ చంద్రగిరి ఎమ్మెల్యే అభ్యర్థి పులివర్తి నాని అన్నారు. సోమవారం తిరుపతి ఆర్టీవో కార్యాలయం వద్ద నిరసన దీక్ష చేపట్టారు. పోలీసులు ఈ నిరసన దీక్ష శిబిరాన్ని భగ్నం చేయడానికి ప్రయత్నించగా పులివర్తి నాని పెట్రోల్ పోసుకుని ఆత్మహత్య ప్రయత్నించగా పోలీసులు నీళ్లు చల్లి అడ్డుకున్నారు. తర్వాత ఆయనను అదుపులో తీసుకున్నారు. అంతకు ముందు పులివర్తి నాని మాట్లాడుతూ చంద్రగిరి నియోజకవర్గంలో చెవిరెడ్డి మోహిత్ రెడ్డి ఓడిపోతారని భయంతోనే దొంగ ఓట్లు నమోదు చేశారని ఆరోపించారు. అడ్డదారిలో గెలిపించుకోవడానికి భారీ ఎత్తున దొంగ ఓట్లు నమోదు చేశారని ఇటు జిల్లా ఎన్నికల అధికారులకు అటు రాష్ట్ర ఎన్నికల అధికారి ఫిర్యాదు చేసిన బోగస్ ఓట్ల తొలగించక పోవడం దారుణమన్నారు. బోగస్ ఓట్లను ఏరివేయాలని డిమాండ్ చేశారు. ఓటర్ల జాబితాపై ఇంత నిర్లక్ష్యమా.. సహకరిస్తున్న కొందరు అధికారులపై చర్యలు తీసుకోవాలని కోరారు. గత 7నెలలుగా పోరాడుతున్నా పట్టించుకోక పోవడం ఏమిటని మండిపడ్డారు. ఎమ్మెల్యే సూచనలతో భారీగా బోగస్ ఓట్లు నమోదు చేశారన్నారు. అధికారులు ప్రజాస్వామ్యానికి విలువ ఇవ్వాలని సూచించారు. నిరసన కార్యక్రమానికి తిరుపతి మాజీ ఎమ్మెల్యే సుగుణమ్మ, నరసింహ యాదవ్, శ్రీధర్ వర్మ, రవి నాయుడు, ఊక విజయ్ కుమార్, కార్పొరేటర్ మునికృష్ణ పాల్గొన్నారు.

పులివర్తినానికి అస్వస్థత-
చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలింపు

పెట్రోల్తో ఆత్మహత్యకు యత్నించిన పులివర్తినానిని పోలీసులు అడ్డుకున్నారు. ఆ క్రమంలో పెద్దఎత్తున కార్యకర్తలు, పోలీసులు మధ్య తోపులాట జరిగింది. నానికి పెట్రోల్ కళ్లలో పడి తోపులాటలో ఆయన అస్వస్థతకు గురయ్యారు. దీంతో టీడీపీ నాయకులు ఆయనను ఆసుపత్రికి తరలించారు.

టిటిడి ఉద్యోగులందరికీ ఇళ్లపట్టాలు

రెండో విడత పంపిణీలో భూమన కరుణాకరరెడ్డి
మిగిలినవారికి ఏర్పేడు వద్ద 450 ఎకరాలు సేకరణ



ప్రజాశక్తి - తిరుపతి సిటి: దేశంలో ఏ ప్రభుత్వ ఉద్యోగికీ లేనివిధంగా అతి తక్కువ ధరకు ఉద్యోగులందరికీ ఇళ్లపట్టాలు ఇచ్చిన ఘనత టీటీడీకే దక్కుతుందని టీటీడీ ధర్మకర్తల మండలి అధ్యక్షులు భూమన కరుణాకరరెడ్డి తెలియజేశారు. ఉద్యోగులకు తన చేతులమీదుగా ఇంటిపట్టాల పంపిణీ జరగడం తన అదృష్టమన్నారు. టీటీడీ ఉద్యోగులకు రెండో విడత ఇంటి పట్టాల పంపిణీ పండుగ కార్యక్రమం సోమవారం ఉదయం తిరుపతి మహతి ఆడిటోరియంలో వేడుకగా జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన కరుణాకర రెడ్డి మాట్లాడుతూ 17 సంవత్సరాల క్రితం తాను టీటీడీ ఛైర్మన్ గా ఉన్న సమయంలో అప్పటి ముఖ్యమంత్రి వైయస్ రాజశేఖరరెడ్డిని కలిసి ఉద్యోగుల ఇళ్ల స్థలాల విషయమై చర్చించినట్లు చెప్పారు. తన ఒత్తిడి వల్లే ఉద్యోగులకు ఇంటిస్థలాలు మంజూరు చేసినట్టు 2009లో వైఎస్ రాజశేఖరరెడ్డి ఇదే వేదిక మీద తెలియజేశారని ఆయన గుర్తు చేశారు. ఉద్యోగులందరికీ ఇంటి స్థలాలు ఇప్పించే విషయం గురించి ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డిని తాను సంప్రదించినప్పుడు ఆయన ఉద్యోగులందరికీ ఉచితంగా ఇంటి స్థలాలు ఇద్దామని చెప్పారన్నారు. అయితే చట్ట ప్రకారం ఇందులో కొన్ని ఇబ్బందులు ఎదురవుతున్న కారణంగానే నామమాత్రపు ధరతో ఉద్యోగులకు, రిటైర్డ్ ఉద్యోగులందరికీ ఇంటి పట్టాలు మంజూరు చేయడానికి ముఖ్యమంత్రి అంగీకరించారన్నారు. ఈ కార్యక్రమాన్ని సాకారం చేయడంలో ఈఓ ధర్మారెడ్డి, జిల్లా కలెక్టర్ వెంకటరమణారెడ్డి, జేఈవోలు సదా భార్గవి, వీరబ్రహ్మం, ఇతర కార్యనిర్వాహకవర్గం తనకు చేదోడు వాదోడుగా ఉండి ముందుకు నడిపించారని అభినందించారు. మూడో విడతగా రిటైర్డ్ ఉద్యోగులకు, మిగిలిన ఉద్యోగులందరికీ ఇంటి స్థలాలు ఇవ్వడం కోసం ఏర్పేడు మండలం పాగాలి వద్ద 350 ఎకరాల భూమిని టిటిడికి ఇవ్వడంలో కలెక్టర్ వెంకటరమణారెడ్డి కృషి అభినందనీయమన్నారు. ఇందుకోసం ధర్మకర్తల మండలిలో 87 కోట్ల 50 లక్షల రూపాయలు మంజూరుచేయించడంలో ఈవో ప్రత్యేక శ్రద్ధ చూపారన్నారు. ఏర్పేడు వద్ద ఈ నెలాఖరు లోపు 450 ఎకరాలను ప్రభుత్వం నుండి స్వాధీనం చేసుకుని మూడో విడతలో రిటైర్డ్ ఉద్యోగులకు, ఉద్యోగులకు అందిస్తామన్నారు. త్వరలోనే 4 వేల మందికి పైగా ఉద్యోగులకు, రిటైర్డ్ ఉద్యోగులకు ఇంటిస్థలాలు అందజేస్తామని చెప్పారు. అనంతరం ఛైర్మన్ భూమన కరుణాకరరెడ్డి, ఈవో ధర్మారెడ్డి చేతులమీదుగా ఉద్యోగులకు ఇంటిస్థలం పత్రాలను మొత్తం 1703 మందికి రెండో విడతలో ఇంటిస్థలాలు పంపిణీ చేశారు. జేఈవో సదా భార్గవి, సివిఎస్ఓ నరసింహ కిషోర్, డిఎల్వో వీర్రాజు, సిఈ నాగేశ్వరరావు పాల్గొన్నారు.

విద్యుత్ కాంట్రాక్టు కార్మికుల ధర్నా



ప్రజాశక్తి- తిరుపతి టౌన్: జోరున కురుస్తున్న వర్షాన్ని సైతం లెక్కచేయకుండా విద్యుత్ కాంట్రాక్ట్ కార్మికులు, స్టోర్ హమాలీలు ఏపీ ఎస్పీడీసీఎల్ ఎస్ఈ కార్యాలయం ఎదుట సోమవారం యునైటెడ్ ఎలక్ట్రిసిటీ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ (సిఐటియు) ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ధర్నాను చేపట్టారు. ఈసందర్భంగా సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి కందారపు మురళి మాట్లాడుతూ జగన్మోహన్ రెడ్డి ఎన్నికలకు ముందు చెప్పిన ఏ హామీని అమలు చేయలేదని, కాంట్రాక్టు కార్మికుల రెగ్యులరైజేషన్ మూడు నెలల్లో ప్రకటిస్తామని చెప్పి నాలుగున్నర సంవత్సరాలు కావస్తున్నా పట్టించుకోకపోవడం దారుణమని విమర్శించారు. కాంట్రాక్టు కార్మికులను మోసగించిన ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డికి గుణపాఠం తప్పదని ఆయన హెచ్చరించారు. ఎన్నికలకు ముందు విద్యుత్ కార్మికులు అత్యంత కీలకమైన వారని, ఆదుకోవడం తన మొదటి కర్తవ్యమని కథలు చెప్పిన రాష్ట్ర ముఖ్యమంత్రి... అధికారంలోకి వచ్చాక వారిని పూర్తిగా విస్మరించారని ధ్వజమెత్తారు. జగన్మోహన్ రెడ్డికి చిత్తశుద్ధి ఉంటే తక్షణం విద్యుత్ శాఖలో పనిచేస్తున్న కాంట్రాక్టు కార్మికులందర్నీ రెగ్యులరైజ్ చేయాలని డిమాండ్ చేశారు. విద్యుత్ కాంట్రాక్టు కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కుమార్ ప్రసంగిస్తూ కాంట్రాక్ట్ కార్మికులు రెక్కలు, ముక్కలు చేసుకుని దశాబ్ద కాలానికి పైగా పని చేస్తుంటే రెగ్యులరైజేషన్కు నోచుకోకపోవడం దారుణమని అన్నారు. తక్షణం తమ సమస్యలను పరిష్కరించకుంటే రాష్ట్రంలో విద్యుత్ కార్మికులు సమ్మెకు వెళ్లాల్సి వస్తుందని హెచ్చరించారు. కాంట్రాక్ట్ కార్మికులు సాగిస్తున్న పోరాటానికి యునైటెడ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ యూనియన్ పర్మినెంటు ఉద్యోగుల సంఘం తరపున మద్దతు ప్రకటించారు. శివప్రసాద్ రెడ్డి, పెంచల ప్రసాద్ లు ప్రసంగిస్తూ సంఘీభావం తెలిపారు. అనంతరం సీఎండి కె.సంతోషరావుకు కార్మికులు వినతిపత్రం సమర్పించారు. ఆయన స్పందించి తన పరిధిలోని అన్ని అంశాలను పరిష్కరిస్తానని మిగిలిన విషయాలు ప్రభుత్వానికి లేఖ రాస్తామని సీఎండి తెలిపారు. విద్యుత్ కార్మికుల ధర్నా కార్యక్రమం దృష్ట్యా తిరుపతి జిల్లా పోలీసులను పెద్ద ఎత్తున మోహరింప చేశారు. సిఐటియు నగర కార్యదర్శి కే. వేణుగోపాల్, స్టోర్ హమాలీల యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు ఆరోగ్యదాస్, యూనియన్ జిల్లా అధ్యక్షులు నారాయణ, ఖాదిర్, సుదర్శన్ బాబు, ప్రసాద్, రవికుమార్, చిరంజీవి, మురళి, సోము, భార్గవ్, వినోద్ పాల్గొన్నారు.

వాహనాల తనిఖీ

ప్రజాశక్తి -కోట : రానున్న ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని కోట-గూడూరు రోడ్డులో నగదు, లిక్కర్ తదితర అక్రమ రవాణాను నిరోధించేందుకు కోట ఎస్ఐ పి నాగబాబు ఆధ్వర్యంలో పోలీసులు వాహనాలను తనిఖీ చేశారు. ఈ మేరకు సోమవారం ఉదయం విద్యానగర్ నుండి గూడూరుకు వెళ్లే రోడ్డుపై వాహనాలను తనిఖీ చేసే ఏర్పాట్లను ప్రారంభించామని ఎస్ఐ నాగబాబు తెలిపారు. ఎవరైనా అక్రమంగా నగదు, లిక్కర్, తదితరాలను రవాణా చేస్తే చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. వారి వెంట పోలీస్ సిబ్బంది కృష్ణమూర్తి, వెంకటేశ్వర్లు ఉన్నారు.

బుచ్చినాయుడు కండ్రిగ: స్థానిక చెక్‌పోస్టు ఆవరణలో బుచ్చినాయుడు కండ్రిగ ఎస్ఐ వెంకట నరసింహ తమ సిబ్బందితో సోమవారం వాహనాలను తనిఖీ చేశారు. ముందస్తు ఇతర రాష్ట్రాల నుండి మద్యం, నగదును తీసుకొస్తే వారు ఎవరైనా సరే వారిని అదుపులోకి తీసుకుని ఆ మద్యం, నగదును ప్రభుత్వానికి అప్పగించేందుకు పోలీస్ సిబ్బంది ముందస్తు వాహనాల తనిఖీలను నిర్వహిస్తున్నారు. ఎంతో మంది ఎన్నికలకు సంబంధించి ముందస్తు మద్యం, నగదును నిల్వ చేసుకుంటుండటం దృష్టిలో ఉంచుకుని ప్రతిరోజు చెక్ పోస్ట్ దగ్గర అనేక చోట్ల తనిఖీలు నిర్వహిస్తున్నామని తెలిపారు. ఎవరైనా పట్టుబడితే వారిపై నేరుగా కేసులు నమోదు చేసి జైలుకు పంపుతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది ప్రభాకర, రమేష్, సురేష్ పాల్గొన్నారు.

వైసీపీ ప్రభుత్వ హయాంలో రాష్ట్రం దివాలా

- మాజీ ఎమ్మెల్యే సునీల్‌కుమార్

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : వైయస్ జగన్మోహన్ రెడ్డి పాలనలో మన రాష్ట్రం అప్పుల్లో దేశంలో మొదటి స్థానంలో నిలిచిందని, కౌలు రైతుల ఆత్మహత్యల్లో రాష్ట్రం దేశంలో రెండో స్థానంలో నిలిచిందని గూడూరు మాజీ ఎమ్మెల్యే సునీల్ కుమార్ ఆరోపించారు. గూడూరు టిడిపి కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో మాజీ ఎమ్మెల్యే సునీల్ కుమార్ మాట్లాడుతూ వైయస్ జగన్మోహన్ రెడ్డి పాలనలో రైతులు తీవ్రంగా నష్టపోయారని, యువతకు ఉపాధి అవకాశాలు కల్పించడంలో రాష్ట్ర ప్రభుత్వం తీవ్రంగా వైఫల్యం చెందిందని విమర్శించారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు భాస్కర్ రెడ్డి, శ్రీనివాసులు, చెంచు రామయ్య , వెంకటేశ్వర్లు రాజు , రహీం పాల్గొన్నారు.

వేడుకగా విద్యుత్ విశ్రాంత ఉద్యోగుల వార్షికోత్సవం

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్: పుత్తూరు విద్యుత్ డివిజన్ విశ్రాంత ఉద్యోగుల సంఘం 13వ వార్షికోత్సవం సోమవారం వేడుకగా నిర్వహించారు. ఈ సందర్భంగా తిరుపతి డిస్కం విశ్రాంత ఉద్యోగుల గౌరవ అధ్యక్షుడు కే ఎస్ ఎన్ చారి మాట్లాడుతూ విశ్రాంత ఉద్యోగుల హక్కు కోసం సంఘం పోరాడుతోందన్నారు. అనంతరం 70 ఏళ్లు దాటిన 9 మంది ఉద్యోగులను సన్మానించారు. ఈ కార్యక్రమంలో డిస్కం అధ్యక్షుడు లక్ష్మీనారాయణ, కార్యనిర్వాహక అధ్యక్షుడు చంద్రశేఖర్, కార్యదర్శి వేణుగోపాల్ అయర్, పుత్తూరు డివిజన్ అధ్యక్షుడు గోవిందరాజులు, కార్యదర్శి భాస్కర్, ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగుల అధ్యక్షులు భాస్కర్ రాజులు పాల్గొన్నారు.

సంక్రాంతి సెలవుల్లో జాగ్రత్త వహించాలి

ప్రజాశక్తి- బుచ్చినాయుడు కండ్రిగ: మండలంలో ప్రభుత్వ పాఠశాలలో ప్రైవేటు పాఠశాలలు నేటి 9వ తేదీ నుండి మంగళవారం నుండి జనవరి 18 వ తేదీ వరకు రాష్ట్ర ప్రభుత్వం సెలవులు ప్రకటించిన నేపథ్యంలో విద్యార్థులను ఇంటి నుంచి బయటకు వెళ్లనివ్వకుండా వారి తల్లిదండ్రులు జాగ్రత్త వహించాలని అధికారులు పేర్కొన్నారు. సెలవుల్లో పిల్లల తల్లిదండ్రులు విద్యార్థులను ఏ చెరువుల వద్దకు, గుంటల దగ్గరకు పంపకుండా ఇంటిలో కూర్చోబెట్టి వారిని చదివించి నిఘా వేసి తగు జాగ్రత్తలు తీసుకోవాలని విద్యాశాఖ అధికారులు హెచ్చరించారు. విద్యార్థులకు బైకులు అలవాటు చేసి వాటిపై విద్యార్థులు వీరవిహారం చేయడం, అది వారికి, వారి కుటుంబానికి నష్టం కలుగుతుందని ఈ సంక్రాంతి సెలవులకు విద్యార్థులకు ఎలాంటి బైకులు ఇవ్వకుండా ఇంటి వద్దనే క్రమ శిక్షణతో వారిని కాపాడుకోవాలని తెలిపారు.

శ్రీ పద్మావతి మహిళా వర్సిటీలో డిబేట్ పోటీ

ప్రజాశక్తి - క్యాంపస్ : విజయవాడలో 125 అడుగుల ఎత్తు కలిగిన డాక్టర్ బిఆర్ అంబేద్కర్ విగ్రహావిష్కరణ సందర్భంగా స్థానిక పద్మావతి మహిళా యూనివర్సిటీలో సోమవారం డిబేట్ పోటీ నిర్వహించారు. ఎన్ఎస్ఎస్, డీన్ స్కూల్ ఎఫైర్స్ సంయుక్తంగా శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం విద్యార్థులకు డిబేట్ కాంపిటీషన్ ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు పాల్గొని విజయవంతం చేశారు. గెలిచిన విద్యార్థులకు బహుమ తులు అందించారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్, డీన్ స్టూడెంట్స్ ఎఫైర్స్ ప్రొఫెసర్ జె. కాత్యాయని, ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ ప్రొఫెసర్ ఎం విద్యావతి, జడ్జిగా డాక్టర్ టి శిరీష, విద్యా విభాగం, ఎన్ఎస్ఎస్ యూనిట్ 5 ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ వి.మాధవి, విద్యార్థులు పాల్గొన్నారు.

సచివాలయంను ప్రారంభించిన ఎమ్మెల్యే

ప్రజాశక్తి- నారాయణవనం: మండలంలోని అరణ్యకండ్రిగ సచి వాలయ నూతన భవనాన్ని సత్యవేడు ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం సోమవారం ఉదయం తొమ్మిది గంటలకు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన ప్రభుత్వం అందిస్తున్న అన్ని పథకాలను ప్రజలకు వివరించారు. వచ్చే ఎన్నికల్లో రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డిని మళ్లీ ముఖ్యమంత్రిగా గెలిపించుకుని ఇంకా అభివృద్ధి చెందేలా ప్రజలను నడిపించాలని ప్రజలకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ దివాకర్ రెడ్డి, సర్పంచ్ సాయి రవి, చైర్మన్ సుబ్రహ్మణ్యం యాదవ్, వైసిపి కార్యకర్తలు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా నేదురుమల్లి జన్మదిన వేడుకలు

ప్రజాశక్తి - బాలాయపల్లి : వైసిపి జిల్లా అధ్యక్షుడు వెంకటగిరి సమన్వయకర్త నేదురుమల్లి రాంకుమార్ రెడ్డి జన్మదిన వేడుకలు ఆ పార్టీ మండల కన్వీనర్ వెందోటి కార్తిక్ రెడ్డి, రాష్ట్ర మహిళ అధికార ప్రతినిధి రాయి దేవికా చౌదరిల ఆధ్వర్యంలో సోమవారం ఘనంగా నిర్వహించారు. అనంతరం 30 కేజీల కేక్ ని కట్ చేసి పంపిణీ చేశారు.

పదవ తరగతి విద్యార్థులకు అండగా ఉంటూ పూర్తి సహకారాలు అందిస్తామని వైసిపి మండల కన్వీనర్ వెందోటి కార్తీక్ రెడ్డి పేర్కొన్నారు. సోమవారం వైసిపి జిల్లా అధ్యక్షుడు నేదురుమల్లి రామ్ కుమార్ రెడ్డి జన్మదిన వేడుకలు సందర్భంగా మండలంలో ని వెంగమాంబ గ్రామంలో ఉన్న జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదవ తరగతి విద్యార్థులకు పరీక్షల సామగ్రిని అందించారు. అనంతరం రాష్ట్ర మహిళ అధికార ప్రతినిధి రాయి దేవిక చౌదరి, పాఠశాల సిబ్బంది, వైసిపి నాయకులు రాంబాబు నాయుడు, సురేష్, వెంకటకృష్ణ మనాయుడు, గ్రామ సర్పంచి బాపనపల్లి వెంకట సుబ్బయ్య నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

వెంకటగిరి: వైసిపి వెంకటగిరి నియోజకవర్గ సమన్వకర్త నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి జన్మదినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. సోమవారం బాలసదన్‌లో ఆయన జన్మదినోత్సవ వేడుకను నాయకులు, కార్యకర్తలు నిర్వహించుకున్నారు. 14వవార్డు కౌన్సిలర్ ఆరిశంకరయ్య స్థానిక పాఠశాల్లో ఆయన కేక్‌ను కట్‌చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ రాబోవు ఎన్నికల్లో బారీ మెజారిటీతో గెలిచి కేబినెట్‌లో మంత్రిగా పనిచేయాలని ఆకాంక్షించారు. ఇలాంటి పుట్టినరోజులు మరెన్నో చేసుకోవాలని కోరుకున్నారు.

ప్రకృతి వ్యవసాయంపై అవగాహన


ప్రజాశక్తి - పిచ్చాటూరు: 'వర్డ్' ప్రకృతి వ్యవసాయ వెంగళతూరు జిల్లా పరిషత్ పాఠశాల విద్యార్థులకు ప్రకృతి వ్యవసాయంపై సోమవారం ప్రత్యక్ష శిక్షణ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా ప్రధానోపాధ్యాయులు ఈశ్వర్ రెడ్డి, వర్డ్ కార్యదర్శి డాక్టర్ గంగాధరం, ఉపాధ్యాయులు హరి ప్రసాదు, దినకర బాబు, డాక్టర్ పాండురంగ శెట్టి, తులసీరామ్, విద్యార్థులు, రైతులు పాల్గొన్నారు.

టెన్నిస్ విన్నర్‌గా మాజీ డీఎం

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: విక్రమ్ స్పోర్ట్స్ టెన్నిస్ అకాడమీ ఆధ్వర్యంలో జరుగుతున్న ఆల్ ఇండియా సీనియర్ టెన్నిస్ పోటీల్లో 82 ఏళ్ల మాజీ ఆర్టీసీ డిపో మేనేజర్ విజేతగా నిలిచారు. 70 ప్లస్ డబుల్స్ విభాగంలో పోటీపడ్డ శ్రీకాళహస్తి ఆర్టీసీ మాజీ డిపో మేనేజర్ సాయి రాం బాబు ఏకంగా విజేతగా నిలిచారు. సోమవారం ఆయనకు బిజెపి రాష్ట్ర కార్యదర్శి కోలా ఆనంద్ ట్రోఫీని జ్ఞాపికను అందజేశారు. నిర్వాహకులు డాక్టర్ చంద్రశేఖర్, మాజీ సీఐ వేణుగోపాల్ పాల్గొన్నారు.

అధికారుల చేతివాటం

• బాధితులకు అందని సాయం • రోడ్డు ఎక్కిన తుపాను బాధితులు



ఆందోళన నిర్వహిస్తున్న తుపాను బాధితులు

ప్రజాశక్తి- నాయుడుపేట: మిచౌంగ్ తుపాను ప్రభావంతో ఇటీవల కురిసిన వర్షాలకు జనజీవనం అతలాకుతలమైన సంగతి తెలిసిందే. దీంతో ప్రభుత్వాలు స్పందించాయి. బాధితులకు తక్షణ సహాయార్థం ఉచిత బియ్యాన్ని, నిత్యావసర సరుకులను, ప్రతి ఇంటికీ రెండువేల రూపాయలు నగదును పంపిణీ చేసింది. ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసిన విషయం విదితమే. కానీ ఇక్కడే అధికారులు ప్రజాప్రతినిధుల చేతివాటం ప్రదర్శించారు. పేదలకు పంచే బియ్యం, నిత్యావసర సరుకులు, నగదు విషయంలోనూ అధికారుల చేతివాటం ప్రదర్శించారన్న విషయం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. కొంత మందికి వెయ్యి రూపాయలు, మరి కొంత మందికి రూ.500, ఇంకొందరికి పూర్తిగా ఎలాంటి సాయం అందలేదని సహాయం అందని బాధితులు చెబుతున్నారు. ప్రభుత్వం ప్రతి కుటుంబానికీ 2,500 రూపాయలు చొప్పున ఇవ్వాలని ఆదేశాలు జారీ చేసింది.

తుపాను వచ్చి అన్ని ఊడ్చేసి

నెలకావస్తున్నా ఇప్పటికీ కొంతమంది బాధితులకు సహాయం అందక గగ్గోలు పెడుతున్నారు. తిరుపతి జిల్లా నాయుడుపేట లోని లోతువాణిగుంట ప్రాంతంలో సుమారు 100 కుటుంబాలు సోమవారం ఉదయం వరద సాయం అందలేదంటూ రోడ్డు ఎక్కాయి. వరదలో మునిగిపోయిన లోతట్టు ప్రాంతాలను వదిలేసి అధికారులు మెట్ట ప్రాంతాలలో వరద సహాయం అందించారని 'మేమేం పాపం చేశాము?' అంటూ బాధితులు రోడ్డుపై బైఠాయించి నిరసనను తెలిపారు. దీంతో పోలీసులు రంగ ప్రవేశం చేయవలసిన పరిస్థితి ఏర్పడింది.

అందరికీ అందాల్సిన వరద సాయం కొందరికి అంద కుండా అధికారులు నొక్కేశారని బాధితులు చెప్తున్నారు. ఒక్క లోతువాణిగుంటే కాకుండా నాయుడు పేట లోని తుపాన్ వల్ల దెబ్బతిన్న ఎస్టీ, ఎస్సి కాలనీలకు ప్రభుత్వ సాయం అందించాలని సూచించిన రెవెన్యూ అధికారుల హడావుడి తప్ప బాధితులకు ఎలాంటి సాయం అందలేదు. ఎల్ఏసాగరంలోని ఎస్సీ కాలనీలో కొంత మందికి మాత్రం ఇచ్చి మరి కొంత మందికి ఇవ్వకపోవడం, 'మీకు తర్వాత వస్తాయి..' అని తప్పించుకునే మాటలు చెప్పడం విశేషం. అధికారులు, నాయకులు కలిసి ఇలాంటి ఘనకార్యాలు నిర్వహించారనడంలో ఎలాంటి సందేహం లేదు. వైసీపీ నాయకుల సమక్షంలోనే ఒక కాలనీలో సగం మందికి మాత్రమే ఇచ్చి మిగతా వారికి ఇవ్వక పోవడంలో ఆంతర్యం ఏమిటి? అన్నది తెలియాల్సి ఉంది. బాధితుల విషయంలో అధికారులు ఎలాంటి నియమాలు పాటించి సహాయం అందించారు. రెవెన్యూ అధికారులు ఈ విషయంలో ఎవ్వరికీ సమాధానం చెప్పకపోవడం గమనార్హం. దీనిపై జిల్లా అధికారులు స్పందించి బాధితులకు సహాయం అందించాల్సిన అవసరం ఉంది. వైసీపీ నాయకుల ఆధ్వర్యంలోనే నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఫొటోలకు ఫోజులిస్తూ ప్రతిరోజూ సోషల్ మీడియాలో కనిపించిన నాయకులు ఇవేవీ తెలియనట్లు ఆశ్చర్యం వ్యక్త పరచడం హాస్యాస్పదం. ప్రభుత్వం అందించిన సహాయాన్ని పూర్తిగా ప్రజలకు అందకపోయినా ఏమాత్రం స్పందించకపోవడం గమనార్హం.



బాధితుల ఆందోళనను అడ్డుకుంటున్న పోలీసులు

క్రైం న్యూస్

హత్య కేసులో వ్యక్తికి యావజ్జీవం

ప్రజాశక్తి -తిరుపతి సిటీ: ఓ హత్య కేసులో ఓ నిందితుడికి తిరుపతి కోర్టు యావజ్జీవ శిక్ష విధించింది. 2022, జులై 21వ తేదీ తిరుమల వన్ టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో తిరుమల ఎస్వీ మ్యూజియం ఎదురుగా, సీనియర్ సిటిజన్స్ కు టోకెన్లు ఇచ్చే పాత షెడ్డు వద్ద, డబ్బు క్యూ -4 గేటు లోపల నిద్రిస్తున్న శరవన్ పై తమిళనాడుకు చెందిన బి భాస్కర్ పెద్ద సిమెంటు రాయితో తలపై బలంగా మోది హత్య చేసినట్లు తిరుమల గ్రామ చావిడి వీఆర్ఏ బి.సురేష్ బాబు తిరుమల వన్ టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు నిందితుని పై (సిఆర్ నెం: 32/2023 యుఎస్ 302 ఐపిసి)గా హత్య కేసు నమోదు చేసి నిందితుడిని రిమాండ్ కు పంపారు. పోలీసులు కేసు దర్యాప్తు చేసి, కోర్టులో ఛార్జ్ షీటును దాఖలు చేశారు. కోర్టులో సోమవారం తుది విచారణ పూర్తి అయ్యింది. కేసు పూర్వాపరాలను పరిశీలించిన పిమ్మట గౌరవ న్యాయమూర్తి సాక్ష్యాలతో నిద్రిస్తున్న శరవన్ పై తమిళనాడుకు చెందిన బి.భాస్కర్ నిందితుడిపై హత్యా నేరం నిరూపణ కావడంతో నేరస్తునికి యావజ్జీవ శిక్ష తో పాటు రూ. వెయ్యి రూపాయల జరిమానా విధిస్తూ తిరుపతి 10వ అదనపు జిల్లా సెషన్స్ జడ్జి టి.రామచంద్రుడు సోమవారం తీర్పు వెలువరించారు. ఈ కేసు పరిష్కారానికి అహర్నిశలు కృషిచేసిన తిరుమల వన్ టౌన్ సిఐ జగన్మోహన్ రెడ్డి, పబ్లిక్ ప్రాసిక్యూటర్ కోటేశ్వర రెడ్డి, కోర్టు లైజన్ ఆఫీసర్ ఈశ్వరయ్య, కోర్టు కానిస్టేబుల్ నాగరాజు, తిరుమల వన్ టౌన్ పోలీసులు, కోర్టు మానిటరింగ్ సిస్టం సిబ్బందిని ఈ సందర్భంగా జిల్లా ఎస్పి పరమేశ్వర్ రెడ్డి అభినందించారు.

రూ.3 వేల పెన్షన్‌తో ఆర్థిక భరోసా: మంత్రి



పెంఛన్లు పంపిణీ చేస్తున్న మంత్రి

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : ముఖ్యమంత్రి వైఎస్‌జగన్మోహన్ రెడ్డి అర్హులైన నిరుపేదలకు 3వేల రూపాయల పెన్షన్ మంజూరు చేసి ఆర్థిక భరోసా కల్పిస్తున్నారని రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక వ్యవహారాల, యువజన సర్వీసుల, క్రీడా శాఖా మంత్రి ఆర్‌కె రోజా పేర్కొన్నారు. పెంచిన పెన్షన్ ల పంపిణీని పుత్తూరు మంలంలో సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి ఆర్‌కె రోజా మాట్లాడుతూ చిత్తూరు జిల్లాలో 2,75,207 మందికి 8,065.58 కోట్ల రూపాయలు, పుత్తూరు మండలానికి 3890 మందికి ఒక కోటి 14లక్షల 60వేల రూపాయలను పెన్షన్స్ పంపిణీ చేస్తున్నట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో పుత్తూరు ఎంపీపీ మునివేలమ్మ, వైస్ ఎంపీపీలు స్వామి రెడ్డి, విమలమ్మ, ఎంపీడీవో ప్రసాద్, తహశీల్దారు పరమేశ్వరస్వామి. వెలుగు ఏపిఎం సుబ్బారెడ్డి, సర్పంచులు గోవింద్ స్వామి రెడ్డి, మురళీ మోహన్ యాదవ్, మార్కెటింగ్ కమిటీ చైర్మన్ ప్రజా ప్రతినిధులు, అధికారులు, వైసిపి నాయకులు , కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆంధ్రప్రదేశ్ మెడికల్ రెప్స్ కమిటీ ఎన్నిక



మెడికల్ రెప్స్ నూతన కమిటీ

ప్రజాశక్తి- తిరుపతి టౌన్: ఆంధ్రప్రదేశ్ మెడికల్ అండ్ సేల్స్ రెప్రజెంటేటివ్స్ యూనియన్ తిరుపతి జిల్లా వార్షిక సమావేశం స్థానిక యశోదానగర్‌లోని వేమన విజ్ఞాన కేంద్రంలో నిర్వహించారు. ఈకార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన యూనియన్ జాతీయ కార్యదర్శి కె.మనోహర్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం కార్మిక చట్టాలు మార్పులను తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామని, మెడికల్ రెప్రజెంటేటివ్స్‌కు నిర్దిష్ట పనివిధానాలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. యాజమాన్యాలు డిజిటలైజేషన్ తీసుకొని వచ్చి కార్మికుల మీద విపరీతమైన పనిభారాలను మోపుతున్నాయని దీన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామని తెలిపారు. అనంతరం నూతన కార్యవర్గాన్ని ఎన్ను కు న్నారు . యూనియన్ నూతన అధ్యక్షులుగా బి. శ్రీనివాసు లు, కార్యదర్శి గా బి.కిరణ్, ఉపాధ్యక్షులుగా టి ప్రకాష్, డి.చిరంజీవి, సంయుక్త కార్యదర్శులుగా కె.శివప్రసాద్, డీకే.విద్యాసాగర్, కోశాధికారిగా హనుమంత నాయక్, 10 మంది కమిటీ సభ్యు లను ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలోరాష్ట్ర కమిటీ సభ్యులు ఎం.ఆనంద, సభ్యులు పాల్గొన్నారు.

11న ఢిల్లీలో 'స్వచ్ఛ అవార్డులు'

- నగరాభివృద్ధికి కృషి చేద్దాం : కమిషనర్

ప్రజాశక్తి- తిరుపతి టౌన్: స్వచ్ఛ తిరుపతికి ప్రజలు, సిబ్బంది కలిసికట్టుగా కృషి చేద్దామని తిరుపతి నగరపాలక సంస్థ కమిషనర్ హరిత అన్నారు. తిరుపతి మునిసిపల్ కార్పొరేషన్‌కి స్వచ్ఛ సర్వేక్షన్ 2023లో భాగంగా జాతీయస్థాయిలో అవార్డు రావడంతో నగరపాలక సంస్థ కార్యాలయంలో కమిషనర్ కేక్ కట్ చేసి శానిటరి సూపర్‌వైజర్లు సుమతి, చెంచెయ్యకు తినిపించారు. స్వచ్ఛ సర్వేక్షన్ 2023కు జరిగిన పోటీలలో తిరుపతి జాతీయస్థాయిలో అవార్డు పొందిందని, ఈనెల 11వ తేది డిల్లీలో జరిగే కార్యక్రమంలో అవార్డు అందుకోవడం జరుగుతుందని తెలిపారు. ఈ అవార్డు రావడానికి కృషి చేసిన ప్రజలకు, మునిసిపల్ కార్పొరేషన్ శానిటేషన్, ఇంజనీరింగ్ సిబ్బందికి, సహకరించిన కౌన్సిల్ సభ్యులకు కమిషనర్ అభినందనలు తెలిపారు. డిప్యూటీ కమిషనర్ చంద్రమౌళీశ్వర్ రెడ్డి, మునిసిపల్ ఇంజనీర్లు చంద్రశేఖర్, వెంకట్రామిరెడ్డి, హెల్త్‌ఆఫీసర్ డాక్టర్ యువ అన్వేష్‌రెడ్డి, డీఈలు విజయ కుమార్ రెడ్డి, సంజీవ్ కుమార్, రవీంద్రరెడ్డి, మహేష్, శ్రావణి, రాజు, వెటర్నరీ ఆఫీసర్ డాక్టర్ నాగేంద్రరెడ్డి, సెక్రటరీ రాధిక, ప్లానింగ్ అధికారులు శ్రీనివాసులు రెడ్డి, మేనేజర్ చిట్టిబాబు పాల్గొన్నారు.

అబాకస్‌లో శ్రీ చైతన్య విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: చెన్నైలో జరిగిన ఇంటర్నేషనల్ అబాకస్ పోటీల్లో పట్టణానికి చెందిన శ్రీ చైతన్య ఇంగ్లీష్ మీడియం స్కూల్ (జయరామారావు వీధి) విద్యార్థులు ప్రతిభ చూపారు. రెండవ తరగతి చెందిన యవ్వనేష్, ఎనిమిదో తరగతి చెందిన లోహిత, ఏడవ తరగతికి చెందిన సోహన్, ఐదవ తరగతికి చెందిన రోహన్ లు బంగారు పతకాలు సాధించారు. విజేతలుగా నిలిచిన విద్యార్థులను సోమవారం స్థానిక పాఠశాలలో ఏజీఎం సురేష్, ప్రిన్సిపాల్ శ్రీనివాసరావు, వైస్ ప్రిన్సిపాల్ సుధాకర్ అభినందించారు.

మురుగు కాలువను శుభ్రం చేసిన మున్సిపల్ చైర్మన్

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : పట్టణంలోని స్థానిక 23వ వార్డు లక్ష్మీ నగర్‌లో సోమవారం మురుగు కాలువను మున్సిపల్ చైర్మన్ ఆనంగి హరి శుభ్రం చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పుత్తూరు పట్టణంలోని ప్రజల ఆరోగ్యం దృష్ట్యా మున్సిపల్, ఔట్‌సోర్సింగ్ కార్మికులు తమ విధులకు హాజరు కావాలని ఆయన కోరారు. పారిశుద్ధ్య కార్మికుల సమ్మె నేపథ్యంలో క్షేత్రస్థాయిలో పారిశుద్ధ్యం లోపం కారణంగా ప్రజలు ఇబ్బంది పడుతున్నారని, మానవసేవయే అంటు వ్యాధులు ప్రబలకుండా చూడాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు.

అర్హత ఉంటే పెన్షన్ : ఎమ్మెల్యే

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: టిడిపి ప్రభుత్వ హయాంలో వ్యక్తి చనిపోతేనే మరొకరికి పెన్షన్ వచ్చేదనీ, వైసీపీ ప్రభుత్వంలో అర్హతుంటే చాలు పెన్షన్ మంజూరవుతుందని శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్ రెడ్డి అన్నారు. స్థానిక మున్సిపల్ కార్యాలయ ఆవరణలో సోమవారం వైఎస్సార్ పెన్షన్ కానుకను లబ్ధిదారులకు అందజేశారు. ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో ట్రస్ట్ బోర్డు చైర్మన్ అంజూ రు తారక శ్రీనివాసులు, జనార్దన్ రావు పాల్గొన్నారు.

ప్రజలకిచ్చిన హామీలు ఏమయ్యాయి: సుగుణమ్మ

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): రాష్ట్రానికి ప్రపంచ స్థాయి రాజధానిని ఏర్పాటు చేయడానికి ప్రయత్నించిన చంద్రబాబును అక్రమంగా అరెస్టు చేసి, ప్రతిపక్ష పార్టీలపై దాడులు చేయిస్తూ పైశాచిక ఆనందాన్ని పొందుతున్నారని అధికార పార్టీపై తిరుపతి మాజీ శాసన సభ్యురాలు సుగుణమ్మ విమర్శించారు. ఇచ్చిన హామీలు ఏమయ్యాయని ప్రశ్నించారు. సోమవారం తిరుపతి ప్రెస్ క్లబ్ లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు.

కళాశాల స్థలాన్ని కాపాడండి

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: కబ్జాదారుల నుంచి తొట్టంబేడు ప్రభుత్వ బాలికల కళాశాల స్థలం కాపాడాలని తిరుపతి పార్లమెంటు తెలుగుమహిళ అధ్యక్షురాలు చక్రాల ఉష సోమవారం తిరుపతి కలెక్టరేట్ లో జరిగిన స్పందనలో డీఆర్వో పెంచల కిషోర్ కు ఫిర్యాదు చేశారు. ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలకు సర్వే నెంబరు: 185/12లో 6.67 ఎకరాలను 1996లో కేటాయించారన్నారు. గతంలో కొందరు వ్యక్తులు అక్రమంగా నిర్మాణాలు చేపట్టడంతో ఆగ్రహించిన విద్యార్థినులు వాటిని కూల్చేశారని తెలిపారు. అప్పట్లో కబ్జాదారులు కళాశాల ప్రిన్సిపాల్ సుధాకర్ పై అక్రమ కేసులు కూడా పెడితే కొందరు పాత్రికేయులు జోక్యం చేసుకుని ఇది అన్యాయమని ప్రిన్సిపాల్ ను పోలీసు స్టేషన్ నుంచి విడిపించిన సంగతి గుర్తు చేశారు. టీడీపీ హయాంలో 2018వ సంవత్సరంలో ఈ కళాశాల స్థలం కబ్జాకు గురి కాకుండా ఉండటానికి ప్రహరీ నిర్మాణం కోసం రూ.2కోట్లు నిధులు మంజూరు చేయించారన్నారు. అప్పట్లో ప్రహరీ నిర్మాణ పనులు కూడా చేపట్టారన్నారు. అయితే 2019లో ఎన్నికలు జరిగి అధికార మార్పిడి జరగడంతో కొందరు నేతలు ఈ పనులు ఆపించేశారన్నారు. ప్రస్తుతం కొందరు నాయకుల పేర్లు చెప్పి దర్జాగా కబ్జా చేసుకోడం పరిపాటిగా మారిపోయిందన్నారు. అధికారులు స్పందించి ఆక్రమణకు గురైన కళాశాల స్థలం కాపాడాలని, కబ్జాదారులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఆమె విజ్ఞప్తి చేశారు.

ఏపీ ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్స్ రాష్ట్ర అధ్యక్షులుగా లక్ష్మీపతి

వ జా శ క్తి - తి రు వ తి (వు ం గ ళ ం) : ఆంధ్రప్రదేశ్ ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్స్ రాష్ట్ర అధ్యక్షులుగా తిరుపతి ఫ్లయింగ్ స్క్వాడ్ ఎఫ్ఆ ర్వో లక్ష్మీపతి ఎన్నిక య్యారు. ఈ మేరకు విజయవాడ లోని ఓ ప్రైవేటు హోటల్‌లో ఏపీ ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్స్ ఎన్నికలు నిర్వ హించా రు. ఎన్నికల అధికారులుగా పీలేరు డిఎఫ్ఓ జేవీ. సుబ్బారెడ్డి, విజయవాడ డిఎఫ్ఓ రవిశంకర్ శర్మ వ్యవహరించారు. నూతన జనరల్ సెక్రెటరీగా విజయ వాడ ఎఫ్ఆర్ఓ కే. శ్రీనివాసులు రెడ్డి, కోశాధికారిగా విశ్వేశ్వరయ్య, జాయిం ట్ సెక్రటరీగా ఏ. సౌజన్య, వైస్ ప్రెసిడెంట్ రాయలసీమ టి. ప్రభాకర్ రెడ్డి, వైస్ ప్రెసిడెంట్ ఆంధ్రగా ఎస్ వి కె కుమార్, రిజనల్ సెక్రటరీ రాయలసీమగా అశోక్ యాదవ్, రిజనల్ సెక్రటరీ ఆంధ్రగా ఆర్. రాజాబాబు, అదన జాయింట్ సెక్రటరీగా పి.శ్రీనివాసరావులు ఎన్నికయ్యా రని ఎన్నికల అధికారులు ప్రకటించారు. రాష్ట్ర నూతన అధ్యక్షులుగా ఎన్నికైన లక్ష్మీపతి సిసీఎఫ్ ను మర్యాద పూర్వకంగా కలిశారు. నూతనంగా ఆఫీస్ బారెర్స్ ను అభినందించారు.


'ఇన్ ఫ్యాంట్ జీసస్'లో ఘనంగా సంక్రాంతి

ప్రజాశక్తి -రేణిగుంట : పాత చెక్ పోస్ట్ లోని ఇన్ ఫ్యాంట్ జీసస్ ఇంగ్లీష్ మీడియం ఉన్నత పాఠశాలలో పాఠశాల ప్రిన్సిపాల్ గురుశ్రీ సైమన్ ఆధ్వర్యంలో సోమవారం ముందస్తు సంక్రాంతి సంబరాలు ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు సంప్రదాయ దుస్తులు ధరించి ముందే సంక్రాంతిని ఆహ్వానించారు. విద్యార్థులు వేసిన రంగవల్లికలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. అనంతరం ఆదివారం చిత్తూరులో ఇంటర్నేషనల్ గోజు-రై కరాటే అసోసియేషన్ ఆఫ్ ఇండియా గ్రాండ్ మాస్టర్ సుందర్ మూర్తి ఆధ్వర్యంలో నిర్వహించిన నేషనల్ గోజు-రై కరాటే పోటీలలో పాల్గొని 56 మెడల్స్ సొంతం చేసుకున్న విద్యార్థులను ప్రిన్సిపాల్ గురుశ్రీ సైమన్, ప్రధానోపాధ్యాయులు అల్ఫ్రెడ్ ప్రేమ్చంద్, ఉపాధ్యా యులు అభినందించారు. కరాటే పోటీలలో 31 మంది విద్యార్థులు పాల్గొని కటాస్, ఫైట్ విభాగాలలో అత్యంత ప్రతిభ కనబరిచి రెండు విభాగాలు కలుపుకొని 10 గోల్డ్ మెడల్స్,9 సిల్వర్ మెడల్స్,37 బ్రాడ్జ మెడల్స్ కైవసం చేసుకుని కాంపిటేషన్ లోనే అత్యధిక మెడల్స్ సాధించిన పాఠశాలగా గుర్తింపు పొందారు. విద్యార్థులకు శిక్షణ ఇచ్చిన కరాటే మాస్టర్లు దేవరాజులు, ఆనంద్, ముకుంద, కరాటే ఆర్గనైజర్ సౌందర్యకు కృతజ్ఞత లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు అల్ఫ్రెడ్ ప్రేమ్చంద్,సిస్టర్ ట్రెస్సామేరి, ఉపాధ్యాయులు,విద్యార్థులు పాల్గొన్నారు.

'జగనన్న పాల వెల్లువ'పై శిక్షణ

ప్రజాశక్తి-యర్రావారిపాలెం: మండలంలోని వెలుగు కార్యాలయంలో నిర్వహించిన జగనన్న పాలవెల్లువ శిక్షణకి సచివాలయ సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులు, వాలంటీర్స్‌కు సోమవారం శిక్షణ నిర్వహించినట్లు ఎంపీడీవో అమరనాథ్ తెలిపారు. అమూల్ మిల్క్ డెయిరీ ద్వారా పాడి రైతులకు అధిక లబ్ధి చేకూరి నియోజకవర్గంలోనే ఎర్రావారిపాలెం మండలానికి రెండవ స్థానం లభించినట్లు ప్రభుత్వం ప్రకటించిందని జిల్లా పశు సంవర్ధక శాఖ అధికారి రవికుమార్ తెలిపారు. మండలంలో పాడి ఆవులపై ఆధారపడి జీవిస్తున్న రైతులకు అమూల్ మిల్క్ డెయిరీ ద్వారా మరింత ఆర్థిక ఆదాయం అందుతుందని జిల్లా కో-ఆపరేటివ్ అధికారి శ్రీనివాసులు రెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ రెడ్డమ్మ, వైసిపి నాయకులు చెంగల్ రెడ్డి, ఏపీఎమ్, వెటర్నరీ డాక్టర్ , సహకార సిబ్బంది పాల్గొన్నారు.

విద్యా విభాగం ఎస్‌జి శంషాద్‌కి డాక్టరేట్



ప్రజాశక్తి - క్యాంపస్: శ్రీ పద్మావతి మహిళా విశ్వ విద్యాలయం విద్యా విభాగం పరిశోధన విద్యార్థిని షేక్ గౌశల్ శంషాద్ కు విశ్వవిద్యాలయం డాక్టరేట్ ప్రదానం చేశారు. విశ్వ విద్యాలయం విద్యా విభాగం ఆచార్యులు నున్నా అనూరాధ మార్గదర్శకత్వంలో 'ఏ స్టడీ ఆఫ్ నైన్త్ క్లాస్ స్టూడెంట్స్ ఇంగ్లీష్ అచీవ్‌మెంట్ ఇన్ రిలేషన్ టు సైకో సోషల్ వేరియబుల్స్' అనే అంశంపై పరిశోధన గ్రంథం యూనివర్సిటీకి సమర్పించినట్లు వెల్లడించారు. ఇందుకు ఆమెకు డాక్టరేట్ లభించిందని వర్సిటీ డీన్ ఎగ్జామినేషన్ తెలిపారు. శంషాద్‌కి డాక్టరేట్ లభించడంపై రీసెర్చ్ సూపరువైజర్, విద్యా విభాగం ఆచార్యులు, విద్యార్థినులు ఆమెకు అభినందనలు తెలిపారు.

ఎంసీఏ ఫలితాల్లో రిమ్స్ విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి -క్యాంపస్ : శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయ పరిధిలో ఎంసీఏ ఫలితాలను ఇటీవల విడుదల చేశారు. ఎంసీఏ మొదటి సంవత్సరం మొదటి సెమిస్టర్ ఫలితాల్లో బైరాగి పట్టెడలోని కొండారెడ్డి రాయలసీమ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇన్ఫర్మేషన్ అండ్ మేనేజ్మెంట్ సైన్సెస్ కళాశాల విద్యార్థులు అత్యుత్తమ ప్రతిభను కనబరిచారని ప్రిన్సిపల్ డాక్టర్ జెట్టిపల్లి ప్రకాష్ రెడ్డి పేర్కొన్నారు. ఉత్తమ జిపిఏ సాధించిన విద్యార్థులను ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ జెట్టిపల్లి ప్రకాశ్ రెడ్డి, చైర్మన్ వై. కొండారెడ్డి, సెక్రటరీలు వై.ఆనందరెడ్డి, వై. విజయ్ రెడ్డి విభాగాధిపతులు పి. మధుర పాల్గొన్నారు.

టిడిపి రాష్ట్ర కార్యదర్శిగా మస్తాన్‌యాదవ్

ప్రజాశక్తి-వెంకటగిరి: టిడిపి రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ మస్తాన్‌యాదవ్‌ను నియమించారు. వెంకటగిరి నియోజకవర్గ అభ్యర్థిగా ప్రయత్నాలు సాగిస్తున్న మస్తాన్‌యాదవ్‌ను ఆ పార్టీ జాతీయ అధ్యక్షులు తగిన ప్రధాన్యత కల్పించడంతో ఆయన కార్యకర్తల్లో ఆనందంలో మునిగిపోయారు. ఈసందర్భంగా ఆయన ముఖ్య అనుచరుడు ఎన్.శ్రీనివాసరావు ఆనందం వ్యక్తం చేశారు.

'టీడీపీతోనే శ్రీకాళహస్తి అభివృద్ధి'

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: టిడిపి అధికారంలోకి వస్తేనే శ్రీకాళహస్తి నియోజకవర్గం అన్ని విధాలా అభివృద్ధి చెందుతుందని ఆ పార్టీ శ్రీకాళహస్తి నియోజకవర్గ ఇన్చార్జి బొజ్జల సుధీర్ రెడ్డి సతీమణి బొజ్జల రిషితా రెడ్డి అన్నారు. పట్టణంలోని దక్షిణ కైలాస నగర్ లో సోమవారం 'ఇంటింటికి మీ బొజ్జల'ను నిర్వహిం చారు. ఈ సందర్భంగా 20 కుటుంబాలకు చెందిన వైసీపీ సానుభూతిపరులు రిషితా రెడ్డి ఆధ్వర్యంలో టిడిపి తీర్థం పుచ్చుకున్నారు. వైసీపీ పాలనకు, గత టిడిపి ప్రభుత్వ పాలనకు మధ్య తేడాను ప్రజలు గమనించాలని సూచించారు. మళ్లీ బొజ్జల కుటుంబానికి అవకాశం ఇస్తేనే శ్రీకాళహస్తి ప్రజలకు మంచి రోజులు వస్తాయని తెలిపారు.పలువురు టిడిపి నేతలు పాల్గొన్నారు.

నా భర్త ఆచూకీ తెలపాలి: మంజుల

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): దొంగతనం కేసులో తన భర్తను విచారణ నిమిత్తం పోలీసులు గతేడాది డిసెంబర్ 30 తేదీ రాత్రి 10 గంటల సమయంలో ఇంటి నుండి పోలీసులు తీసుకెళ్లారని, ఇప్పటివరకు ఎక్కడ ఉన్నారో కూడా తెలియని పరిస్థితి నెలకొందని రేణిగుంట గణేష్ నగర్ కు చెందిన మంజుల ఆందోళన వ్యక్తం చేశారు. సోమవారం తిరుపతి ప్రెస్ క్లబ్ లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ ఇటీవల పాపా నాయుడు పేట వద్ద బంగారు దుకాణంలో చోరీ జరిగిందని, చేపల వ్యాపారం చేసుకుంటూ జీవనం సాగిస్తున్న తన భర్త రాజేష్ కుమార్ ను విచారణ పేరుతో పోలీసులు తీసుకెళ్లారని, తీసుకెళ్లే సంఘటన ఇంటిలో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలు నిక్షిప్తమయిందన్నారు. అప్పటినుంచి ఎక్కడున్నారో...నేరం చేసి ఉంటే తన భర్తను కోర్టుకు హాజరు పరచడం లేదన్నారు. దొంగతనం చేసిన కేసులో రేణిగుంటకు చెందిన వ్యక్తిని పోలీసులు పట్టుకున్నట్లు పత్రికల్లో వార్తగా వచ్చిందన్నారు. ఈ విషయంలో పోలీసు ఉన్నతాధి కారులు జోక్యం చేసుకొని ఆచూకీ తెలపాలని విజ్ఞప్తి చేశారు.



రాష్ట్ర వాలీబాల్ జట్టుకు ఎంపికైన విద్యార్థులు

రాష్ట్ర వాలీబాల్ జట్టుకు ఎంపిక

ప్రజాశక్తి-చిన్నగొట్టిల్లు: గత ఆదివారం రూరల్ స్పోర్ట్స్ అండ్ గేమ్స్ డెవలప్‌మెంట్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో అండర్- 16 విభాగంలో రాష్ట్ర వాలీబాల్ ఆటల పోటీ నిర్వహించారు. ఈ పోటీల్లో భాకరాపేట గీతాంజలి ఉన్నత పాఠశాల తొమ్మిదవ తరగతి విద్యార్థులు ఎస్ నబీల్ అహ్మద్, పి మహ్మద్ రౌనక్‌లు రాష్ట్ర పోటీలకు ఎంపికయ్యారని గీతాంజలి స్కూల్ కరస్పాండెంట్ కంభం గిరి కుమార్ రెడ్డి అన్నారు. ఈ సందర్భంగా ప్రత్యేక శిక్షణ ఇచ్చిన వ్యాయామ ఉపాధ్యాయులు కృష్ణమూర్తికి పాఠశాల కరస్పాండెంట్ కంభం గిరికుమార్ రెడ్డికి , ప్రిన్సిపల్ పి స్వాతికి, పిల్లల తల్లి దండ్రులు అభినందనలు తెలిపారు. ఢిల్లీలో జరగబోయే పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచాలని పాఠశాల యాజమాన్యం, ఉపాధ్యాయ బృందం, పిల్లల తల్లిదండ్రులు ఆకాంక్షించారు. పాఠశాలలో ముందస్తు సంక్రాంతి పండుగను నిర్వహించారు.

తుపాను బాధితులకు ఆర్థిక సాయం

ప్రజాశక్తి-యర్రావారిపాలెం: మండలంలోని బోడెవాండ్లపల్లి గ్రామ పంచాయతీ వలసపల్లి గ్రామానికి చెందిన గడ్డం శేఖర్, గడ్డం జ్యోతి కుటుంబం నివసిస్తున్న ఇల్లు మిచౌంగ్ తుపాను తాకిడికి కూలిపోయింది. తహశీల్దారు దస్తగిరి ప్రభుత్వం తరపున సోమవారం రూ.5 వేలు ఆర్థిక సాయం అందించారు. ఆ కుటుంబానికి ఇల్లు కట్టుకోవడానికి హౌసింగ్ తరపున ఇల్లు ఇస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ జానకిరామ్, వీఆర్‌వో మస్తాన్ పాల్గొన్నారు.

టిడిపి నాయకులు వైసిపిలో చేరిక

ప్రజాశక్తి -ఏర్పేడు : శ్రీకాళహస్తి నియోజకవర్గం ఏర్పేడు మండలం మర్రి మంద గ్రామానికి చెందిన టిడిపి నాయకులు మునికృష్ణ, ఆనందయ్య, కుప్పయ్య, రమణయ్య, పాపయ్య , జనసేన నాయకుడు తిరుపాల్ వారి అనుచరులు సోమవారం ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్ రెడ్డి సమక్షంలో వైసిపి తీర్థం పుచ్చుకున్నారు.

వరద సాయం అందజేత

ప్రజాశక్తి- ఏర్పేడు : గతంలో మిచౌంగ్ తుపానుకు ఇల్లు, ఇంటి గోడలు కూలిపోయి నష్టపోయిన వరద బాధితులకు ముఖ్యమంత్రి సహాయం కింద మేర్లపాక పంచాయతీలోని ఎస్టీ కాలనీలోని సుమారు 12 కుటుంబాలకు వరద ఆర్థిక సహాయం సర్పంచ్ గంగాధర్ చేతుల మీదుగా సోమవారం అందించారు. ఈ కార్యక్రమంలో ఏర్పడు ఎంపిటిసి భరత్ కుమార్, వీఆర్వో ప్రభాకర్ రెడ్డి, గ్రామ పెద్దలు, వాలంటీర్లు, వార్డు మెంబర్లు పాల్గొన్నారు.

'నారాయణ'లో ముందస్తు సంక్రాంతి

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: స్థానిక నారాయణ ఇంగ్లీష్ మీడియం స్కూల్లో సోమవారం ముందస్తు సంక్రాంతి వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు, విద్యార్థులు సంప్రదాయ దుస్తుల్లో వచ్చి సాంస్కృతిక కార్యక్రమాల్లో ఉత్సాహంగా పాల్గొన్నారు. భోగి మంటల వేసి ఆనందంగా గడిపారు. భోగి, సంక్రాంతి పర్వదినాల విశిష్టతను ఏజీఎం కిషోర్ కుమార్ విద్యార్థులకు వివరించారు. ఆర్ఐ సురేష్ ప్రిన్సిపాల్ ఈశ్వరయ్య పాల్గొన్నారు.